

# దాతృత్వం

కథానిక

"అప్పయ్యా!"

"చిత్తం బాబూ..." వీధిలోంచి.

"ఏమిట్రా అవతలగోడవ?" చిరాకుగా.

"ఏంలేదండి-మరే...బడి కుర్రోళ్ళండి-"

"ఎందుకొచ్చారు-"

"డబ్బీలు పట్టుకొచ్చారండి-గోదావరి చందా యంట."

"అమ్మ-వీళ్ళ దుంపాతెగా-చంపేస్త్రా. లేరు-పొమ్మనలేక పోయావ్?"

"పోండే-ఏయ్ పోండి-మాబాబుగారులేరు-"

"రమ్మనవయ్యా బయటికి-పందలూ పదులూ యిచ్చెయ్య నక్కరలేదు-" పిల్లలగోల.

"బాబుగారూ వీళ్లు వొదిలేటట్టు లేరు."

"ఓహో బడిపిల్లలా! - రండి. మీలో పెద్ద యెవడ్రా?-"

"మా రాజేశ్వర్రావండి-"రాజేశ్వర్రావుముందు కొచ్చాడు డబ్బాపట్టుకుని.

"అయితే యెంత వసూలుచేశార్రా?"

"రెండొందలు దాటింది. మూడోవంద తమ దయవల్ల - కాస్తలో వుందండి-" అన్నాడొక బుడుత.

"అయితే యేదీ ఆ డబ్బా యిలాతే-నాకు తోచిందేదో..." ప్రక్క జేబులో చెయ్యిపెట్టారు పంతులుగారు.

"నాచేతి కిచ్చెయ్యండి-నేను వేస్తాను"అన్నాడొక పెంకిఘటం ముందుకివచ్చి.

"అబ్బే-అలాకాదు-నే వేస్తాగా-"

"చూపించండి-" మరొక కంఠం.

"ఏదో-యిలా కానివ్వండి - మరోదఫా-" చెయ్యి విప్పితే అందులో అణా కానుంది.

"సిగ్గులేకపోయిందిరా పంతులుకి-"ఒకగొంతు.

"అవును, చూడ్రా వాడూ, ఆ తుంబాను-" మరోగొంతు.

"ఆ మీసాలు పీకెయ్యండిరా-" ఒక దురుసు గొంతు.

"ఏయ్-పంతులుగార్ని అలా అనొచ్చా-" వారించబోయాడు అప్పయ్య.

"వాణ్ణి తన్నండిరా ముందు-" ఒక పెంకి గొంతు.

"చూశావ్రా- పంతులుగారి మాట-యింకోదఫా యిస్తాట్ట- మళ్ళీ యిస్తట్లాగే గోదావరిపొంగి నష్టం కలిగించాలట. నోరెలా వచ్చిందిరా అనటానికి? చాలు పదండిరా-" అందరూ వెనుదిరిగారు.

"ఇదిగో నీ అణా-ముడివేసి దాచు-" మొహాన గిరవాటేశాడు పెంకికుర్ర.

"జై పంతులుగారికీ-జై"

"అణాయిచ్చిన పంతులుగారికీ-జై"

"అణా పంతులుగారికీ-జై"

"గుమ్మటేనుగుకీ-జై"

"బొద్దుమీసాలకీ-జై"

జై జై నినాదాలు దూరంగాపోయాయి.

"చూశావురా అప్పయ్యా-వీళ్ళ అల్లరి?"

"చిత్తం బాబూ-మేష్టర్గోర్ని పిలిపించి అడగాలండి-"

"అడగడమా-గట్టిగా బుద్ధి చెప్పడమా-వాడే యీపనికి పురికొలిపి వుంటాడు. ఐనా ఎక్కడో

పి. వి. పల్లి

గోదావరి పొంగడం మనం చందాలు యివ్వడమూనా-బాగుంది-ఖేషుగ్గావుంది."

"చిత్తం-మా బాగా సెలవిచ్చారు-"

"వెళ్ళి ఆ మేష్టర్ని నేను రమ్మన్నానని పిలు."

"చిత్తం-" వెళ్ళిపోయాడు.

*    *    *

"ఎవరది?-శరభయ్యగారా-రండిరండి-"

"ఏంచేస్తున్నారు పంతులుగారు-" కుర్చీలో కూచున్నాడు.

"గోదావరి పొంగి-ఎంతో నష్టం కలిగించిందండి. చూశారా పేపర్లలో? ఎందరో చందాలు పోగు చేస్తున్నారు-"

"అవునవును-ఇప్పుడు కుఱ్ఱాళ్ళు, మనవూళ్లో అందుకేకదూ తిరుగుతున్నారు" కోపంవచ్చినా దిగమింగుకుని పంతులుగారన్నారు.

"కుఱ్ఱబుద్ధి, కోతిబుద్ధి అన్నారు. వీళ్ళు మహరాలుగాయలు పదిరూపాయలు కాయితం మార్చడానికి ఒప్పుకున్నారు కారు."

"అయినా మీ బోటివాళ్లు పదిరూపాయలు యివ్వడమేమిటండీ?"

"అబ్బెబ్బె. అలాకాదు-మరోసారి చూచుకుందామని పంపించేశాను."

"ఖేష్-"

"సరేగాని - యీమధ్య రెండురోజులయింది-మీరుకనబడ్డమే మానేశారు."

"ఆఁ. ఏంలేదండీ. మా అల్లుడు-మీకు తెల్సుకదూ, గోదావరి పార్టీ కార్యదర్శి, రమ్మని కబురంపింతేనూ వెళ్ళాను. తీరావెళ్ళేసరికి ఓ పెద్ద బరువు నెత్తినపెట్టాడు-వల్లకాదంటే మానేడా"

"ఏమిటది?"

"మరేముంది? నిన్నను మీరు పేపర్లో చూడలేదూ——"

"ఏమిటో?..."

"అదేనండీ గోదావరి వరదబాధితుల సహాయనిధి నిమిత్తం గోదావరి పార్టీ సభ్యులు అందరూ కలిసి సుమారు ఓ లక్షరూపాయలు వసూలు చెయ్యడంకోసం ప్రతిజ్ఞ తీసుకున్నారు. అందులో నన్నుగూడా ఆ సంఘంలో సభ్యుడుగా వేశారు"

"ఆఁ.అలాగా - పేపర్లో వడ్డారూ-"

"మరేఁ- మీరు చూడలేదండీ-"

"........"

"వెధవ-ఎక్కడికో వుడాయించాడు" లేచి లేచి బీరువాలోని పేపరు తెచ్చారు పంతులుగారు. కళ్ళజోడు సవరించుకుంటూ పేజీలు తిరగవేస్తున్నారు.

"మూడో పేజీలో నాలుగోలైను చివర చూడండీ-"

"ఆఁ...అవునండోయ్——"మరోసారి కళ్ళజోడు సవరించుకుని——

"గోదావరి వరదబాధితుల సహాయనిధి వసూలుకు గోదావరిపార్టీ సభ్యుల ప్రమాణస్వీకారం-మహాబాగుందండీ హెడ్డింగు!"

"ఇంకా చదవండీ!-"

"ఇన్నో తేదీని శ్రీ రంగయ్యగారి అధ్యక్షతను సమావేశమై యీ దిగువ తీర్మానముల నామోదించడమైనది.

1. శ్రీ సూకాలయ్యగారు అధ్యక్షులుగను, శ్రీ చంచయ్యగారు ఉపాధ్యక్షులుగను శ్రీ రంగయ్యగారు కార్యదర్శిగను - శ్రీ శరభయ్య ప్రభృతులు యిరవైమంది సభ్యులతో ఒక సంఘమును స్థాపించడమైనది.

2. ఆ పార్టీకి "గోదావరిపార్టీ" అని నామకరణము చెయ్యబడది.

3. మరి పన్నెండుగురు సభ్యులను కో ఆప్టు చేసుకొనుటకు కార్యదర్శికి అధికారమీయబడినది.

4. ఈ సంఘము తరఫున ఒక లక్షరూయలకు తక్కువకాకుండా నిధిని వసూలు చేయవలసియున్నది."

"మహాబాగుందండీ యీ ప్రకటన" కాస్సేపాగి కళ్ళద్దాలుతీసి ఒకచేత్తో పట్టుకుని "అయితే శరభయ్యగారూ మొత్తానికి పేపర్లో పడ్డారు. దేశదేశాల మీపేరు మారుమ్రోగిపోతుందన్నమాట" కాస్త అసూయపడ్డట్టు మొహంముడిచాడు పంతులు.

"ఆఁ...యిందులో ఏముందండీ-మూలకున్న ముసలమ్మకూడా యీ నాడు పేపరుకెక్కుతూంటే-మీబోటి అర్థ, అంగ బలసంపన్నులు పడడం ఒకకష్టమా-యింకా మాటాడితే మీరు ఓ వందరూపాయలు చందాయివ్వండీ-గోదావరి పార్టీలోమిమ్మల్ని గూడాసభ్యుడుగా చేర్పిస్తాను."

“అహాఁ...అంతదూరం ఎందుకండీ - మనకి గొప్ప అక్కరలేదుగా-”

“బాబుగోరూ ఇదుగోండి- మేష్టారువచ్చారు”

“ఓహో శంకరంగారూ - దయచేయండి” కుర్చీ చూపించాడు పంతులు శంకరయ్యగారికి.

శంకరంగారు కూచున్నారు.

“అయితే చూడండి-యిప్పుడుండే-ఆ పిల్లలు అంటే మనబడిపిల్లలు-మహాదేవాంతకులండి. మహా బాగా ట్రెయినింగ్ యిచ్చారండీ. లేకపోతే చందాలు వసూలు కావడం కష్టంసుమండీ-”

“వస్తా పంతులుగారూ కొంచెం పనుంది”

“ఏమిటో ఆపని? నాతో చెప్పరాదూ?”

“ఆఁ...ఏముందిలెండి. క్రొత్తగా యీ పదవి ఒకటి వచ్చిందికదా. యీవూళ్లో మీటింగు ఏర్పాటు చేయాలి మాపార్టీ తరఫున. అందుకు అన్ని ప్రయత్నాలూ చెయ్యాలికదండీ-వస్తా”

గుమ్మందిగిపోయాడు శరభయ్య.

“కొంపతీసి మీకేమన్నా అపాయం కలుగ చేశారా?” ఆత్రుతనటించి అడిగాడు శంకరం.

“ఆఁ...ఏం లేదులెండి. డబ్బులువేసేదాకా వదిలేదుకారు”

“మా బాబుగార్ని నానామాటలూ అన్నారండీ” అన్నాడు అప్పయ్య.

“ఛప్-నువ్వు నోరుమూసుకో-వాడితో ఏం లేండి——యింకా చెప్పండి”

“డబ్బు వేసేదాకా వదిలేరుకారు-పోనీలెండి. ధర్మమేకదూ-యివాళ వాళ్ళకయింది రేపు మనకవుతుంది”

“అయ్యో—”

“అయితే యిదా మీరు పిల్లలకిచ్చే ట్రెయినింగు?” ఒక్కసారి హుంకరించాడు పంతులు మేష్టరివేపు ఉరిమిచూస్తూ.

శంకరం త్రుళ్ళిపడ్డాడు. లేచి నిలబడ్డాడు.

“చూడు రేపీపాటికి నిన్నేంచేస్తానో. నీ అంతరం ఎంత? నా అంతరం ఎంత? నీ పిల్లల్ని నావద్దకు చందాకి పంపుతావటోయ్?——ఎన్ని గుండెలుండాలోయ్ నీకు? హరిహరబ్రహ్మాదులకే లొంగలేదీఘటం- తెలుసా? ఏమనుకున్నావో- యిష్టంవచ్చినట్లు ఆ కుర్రకుంకలచేత పేలిస్తావ్? జాగ్రత. యింతకీ వసూలు అయిన సొమ్మేం చేస్తున్నావ్?”

“ఉంచానండి. యిప్పటికి రెండువందల అరవైఆరున్నర అయిందండి. ఆ కాస్త భర్తీఐతే మూడువందలూ పంపేద్దామనుకుంటున్నాను.”

“అలా వీల్లేదు. యీ వూరి పేరుమీదుగా పడాలి. ఆ సొమ్ము పట్టుకొచ్చి నాకిచ్చెయ్యి. మేం పెద్దలంతా కలిసి పంపిస్తున్నాం. అందులో యిది కూడా కలుస్తుంది.”

“అలాగేనండి.”

“అలాగేఅంటే వీలులేదు. ఒరే అప్పాయ్-”

“బాబూ!”

“యీ శంకరంతో వెళ్ళు. రెండువందల అరవై ఆరున్నర యిస్తారు పట్టుకురా.”

“చిత్తం! పదండి శంకరంగోరు. మా బాబుగోరు సామాన్యులుగారు. పులితోటా చెలగాటం!——హుఁ”

* * *

తెల్లారిందో లేదో- అప్పయ్యని పంపించాడు శరభయ్యగారికోసం పంతులు.

“అయితే శరభయ్యగారూ! బహిరంగసభ యెక్కడ ఏర్పాటుచేశారు?”

“అదేనండీ స్థలందొరక్కుండావుంది.”

“అంత శ్రమయెందుకూ- మా ఆతాలో పెట్టించండి.”

“ఎంతమంది జనం పడతారు?”

“సుమారు నాలుగువందలమంది కూర్చోవచ్చును”

“ఏదీ-యిదేనా?”

“అవును-యిదేం తక్కువనుకున్నారటండీ!”

“అబ్బె అదికాదండీ! యింతకన్న మంచి జాగా మరోదగ్గర లభ్యంకాదుకూడాను.”

“బాగా అన్నారు. అయితే యెప్పుడు?”

“బహుశా ఎల్లుండి. యెంచేతంటే, యింకా సభకి అధ్యక్షతవహించేవారెవరో తేలడంలేదు. తర్వాత, అందరికీ ఆహ్వానాలు పంపించాలి మరి. యింతకీ సభాప్రారంభకుడు, ఉపన్యాసకుడు దొరకటంలేదు.”

“అదేం- మీ పార్టీ అధ్యక్షుడు, కార్యదర్శి వాళ్ళు రారా?”

“వాళ్ళు వేరేచోట సభ యేర్పాటుచేస్తారు.

అందరం ఒక్కదగ్గిరే అయితే యేం ప్రయోజనం? ప్రచారం కావద్దూ నాలుగుమూలలా!"

"అహఁ...యెంతమాటన్నారు? మా చిన్నతనంలో వీధిలో సభ జరిపించేవాళ్ళం. అందరం ఒక్కదగ్గిరే మూగేవారమే కాదు. నాలుగుచోట్లా నలుగురం చేరేవాళ్ళం."

"అయితే మీకూ ప్రవేశముందన్నమాట యీ సభల్లో."

"లేకేం? ఆ కాలంవేరు. అదంతా ఒక కథ లెండి!" పెదవి విరిచారు పంతులుగారు.

"అలా అనకండీ! మీతరవాతే మేము. మీరు గురువులు, మేం శిష్యులం."

"ఎంతమాటన్నారు? ఉడుకు రక్తం మీది-మేం మూలజేరిపోయాం."

కొంచెంసేపు ఆలోచించి—

"అబ్బెబ్బె అలా అనకండి! మీకున్న జవసత్వాలు మాకెక్కడివి? మీకున్న పట్టుదల, కార్యశూరత్వం, గౌరవం-మాకేవి? నేనన్నమ్మను, మీరు పెద్దవారయిపోయారంటే. వయస్సుకి పెద్దవారయితే కావచ్చును. కాని భావాల్లో యువకులే. మీకున్న భావాలు మాలో యేవీ? మేం ఊక దంపుడుగాళ్ళమే మిమ్మల్ని చూచే మేం నేర్చుకుంటున్నాం."

పంతులుగారు మందహాసవదనారవిందులై నిమీలితనేత్రులై జేబులో చెయ్యిపెట్టి చుట్టని తీసి, "ఛీ! యిదా నీపని" అని అప్పయ్యమీద విసిరి, ఓ అర్థరూపాయితీసిచ్చి "కత్తెరమార్కు సిగరెట్టుపెట్టె, అగ్గిపెట్టె పట్టుకురా" అని అంటే అప్పయ్య వీధిలోనికి నడిచాడు.

"నేను ఓకోరిక కోరదలచాను— నెరవేర్చక తప్పదు."

"అదేంటండోయ్! కోరికలడగా లావచ్చారు?" అన్నారు, పంతులుగారు చిన్నగా నవ్వుతూ.

"మరేంలేదు. సభ మీ చేతులుమీదుగా..."

"నేనా అధ్యక్షుణ్ణి? అబ్బె-నాకేం తెల్సు!" వద్దన్నట్టు చెయ్యి త్రిప్పసాగారు పంతులుగారు, లోలోన ఉప్పొంగిపోతూ.

"అహఁ అలా కొట్టిపారెయ్యకండి నా మాటని. యీ చుట్టుప్రక్కల గ్రామాల్లో మీ అంత హోదాగలవ్యక్తి మరొకడేడీ? రమ్మనండి ముందుకి-మాద్దాం! ఆ హుందాతనం, ఆ పెద్దమనిషితరహా, ఆపర్సనాలిటీ-ఒక్కడికేనావుందీ?"

అప్పయ్య సిగరెట్టుపెట్టె, అగ్గిపెట్టె తెచ్చి మధ్యన బల్లమీద వుంచాడు.

పంతులుగారు సిగరెట్టు తీసి ముట్టించారు. శరభయ్యగార్కి కూడా యివ్వబోయారు.

"అబ్బెబ్బె మీ తాహతెక్కడ, నా తాహతెక్కడ. నేనా పిజరు సిగరెట్టు కాల్చేవాణ్ణి! మీకే చెల్లుతు. ఆఁ అసలు విషయం మరిచాం-ఆనాటి కార్యక్రమమంతా పెద్ద అక్షరాలతో పేపర్లో పడదటండీ! అప్పుడు నలుగురూ చూచి నిర్ఘాంతపోయి తబ్బిబ్బులవరుటండీ!"

"పోన్లెద్దురూ-అవన్నీ నాకెందుకు? కోరుండి పేపర్లో వేయించుకున్నా నంటూరు ఇతరులు."

"ఆఁ యేమిటన్నారు? యితరులు!-వాళ్లెవరండీ మనల్ని విమర్శించటానికి-ఒచ్చి స్టేజెక్కి నాలుగు ముక్కలనగలరూ?"

"మహా నాకుమాత్రం ఏమొచ్చునండీ!"

"అలా అనకండి. తమరు నోరువిప్పి ఉపన్యాసం మొదలెట్టారంటే సభ అంతా-పిన్‌డ్రాప్ సైలెన్సు అవదుటండీ-యింతెకి తమరు కుర్చీలో కూర్చుంటే నక్షత్రాలమధ్య చంద్రుడులా వుండరటండీ."

"చాల్లెద్దురూ-మీరూ, మీ పొగడ్తానూ!"

"సరే వస్తా-ఎల్లుండి సాయంకాలం నాలుగు గంటలకి తమ ఆవరణలో బహిరంగ సభ జరుపబడుతుందని ప్రకటన చేసేస్తాను."

"సరే కానివ్వండి-మీరలా అంటే నేను కాదనగలనా?"

"ఆఁ ఎంతమాటన్నారు! వస్తా."

* * *

పంతులుగారింటి ఆవరణలో బహిరంగ సభ యేర్పాటు చెయ్యబడింది. సుమారు రెండువందల మంది సభకు హాజరైనారు. ఒక టేబిలు, దానిమీద ఖద్దరు, పువ్వులగుడ్డ, రెండు గాజుబుడ్లు-వాటిలో ఊదొత్తులు కాలుతున్నయ్. టేబిలు ముందు వరుసగా మూడు కుర్చీలు వేయబడినాయి. ఒక కుర్చీలో పంతులుగారు, యింకో కుర్చీలో శరభయ్యగారు కూచున్నారు. మధ్య కుర్చీ కాళీగా వుంది.

సభాస్థలికి పైన "గోదావరి పార్టీకీ జై" "గోదావరి నిధి వసూలు కావాలి" "దాతలంతా యివ్వండి" అనేనినాదాలు వేలాడదీయబడినాయి.

శరభయ్యగారు లేచి—

"సోదరులారా-ఈనాడు జరుగబోయే సమావేశం మీకందరకూ తెలిసిందే. నేను వేరే చెప్పనక్కరలేకుండదనుకుంటాను. ఈనాటి సమావేశానికి శ్రీశ్రీ మన పంతులుగారిని అధ్యక్షత వహించవలసినదిగా ఆహ్వాన సంఘం తరఫునా, గోదావరి పార్టీతరఫునా, మీఅందరితరఫునా కోరుతున్నాను.

సభలో చప్పట్లు.

"పంతులుగార్ని తెలియనివారెవరూవుండరు. ఆయన వయస్సులో పెద్దవారయినప్పటికీ - ఏమంత పెద్దవారు కూడా కారు. మొన్ననే షష్టి పూర్తి జరిగింది. భావాల్లో యువకులు. వేడిరక్తం ప్రవహిస్తూంది. అయనది ఎముకలేని చేయి. ధార్మిక గుణంలో ఆయన వెనుకంజ వెయ్యరు. సత్ప్రవర్తన, త్యాగశీలత, సచ్ఛీలత, దయ,కరుణ, ఆయన సొమ్ము. అలువంటి మహోదారుడు నేడు సభకి అధ్యక్షత వహించనున్నారంటే అది మీభాగ్యంకాదు, మనందరిభాగ్యం."

పూలహారం పంతులుగారి మెడలో వేశాడు శరభయ్య. మళ్ళీ చప్పట్లు.

పంతులుగారు కొస కుర్చీనుండి మధ్య కుర్చీలోనికి వచ్చారు. టేబిలుమీద "కార్యక్రమం" వ్రాసిన కాగితం వుంచబడింది.

తమ స్థూలకాయాన్ని నిలదీసి, గొంతు సవరించి-వాణిని ఓసారి యిటునుండి అటు మార్చి, మరోకసారి గొంతుసవరించి ఇలాఉపన్యసించారు.

"సోదర సోదరీమణులారా-నేను మీముందు నిలబడడానికీ, నోరు విప్పి మాటాడడానికీ అనర్హుణ్ణి. అయినప్పటికీ శరభయ్యగారి మాటా, మీ కోరికా కాదనలేకపోయాను.

గోదావరీ నదీమతల్లికి మన ఆంధ్రులమీద అపారమైన కోపం వచ్చింది. కారణమేమో తెలియదు. ఏదియేమైనప్పటికీ అపార జన, ధన, పశు, గృహనష్టం కలిగాయి. సోదరాంధ్రులు యెన్నో యిక్కట్లు పడినమాట వాస్తవం. అయితే మనమందరం అలా చూస్తూ మిన్నకుండ కాలం. మన హృదయాలు ఊరుకోవు. మన హృదయాలు కరిగిపోయాయి. నేను స్వయంగా చూచివచ్చిన తరువాతనే మీ ముందు యీ విషయాలు ఉంచుతున్నాను. మీరు సావధానంగా విన ప్రార్థన.

ఇంతకీ నేను చెప్పేదేమంటే-సోదరాంధ్రుల కష్టాలను చూస్తూ వూరుకోలేము. నలుగురం సహాయం చెయ్యాలి. నలుగురూ నాలుగు పువ్వులిస్తే దేవుడికి ఒక మాల అవుతుందన్నట్లు-నలుగురూ యెవరికి తోచిందివారు సహాయంచేస్తే మన సోదరాంధ్రులకు మేము స్వయంగా పట్టుకెళ్ళి పంచుతాము."

"అందుకేగాబోలు అణా యివ్వబోయారు పంతులుగారు!" అని కేకలు రాగానే పంతులుగారు ఎర్రగా చూచారు. శరభయ్యగారుసర్దుబాటు చేశారు.

మళ్ళీ పంతులుగారు ఉపన్యాసం మొదలుపెట్టారు—

"నేను నావంతుకు రెండువందల పదహార్లు యిస్తున్నాను. తాముకూడా యెవరికి తోచింది వారు యివ్వవలసినదిగా ప్రార్థిస్తున్నాను—"

"బడిపిల్లలం మొత్తంచేసిన సొమ్మది."సభలో కేకలు. మధ్యలోశరభయ్యగారు కలిగించుకుని—

"సోదరులారా! పంతులుగార్ని అలా అనడానికి వీలులేదు. ఆయన అమాత్రపు కక్కుర్తికి దిగరు. నా మనస్ఫూర్తిగా ప్రమాణంచేసి చెపుతున్నాను. నమ్మండి—"

"చాల్లేవయ్యా- నీ ప్రమాణాలెవరిక్కావాలి? ప్రత్యక్షంగా కనబడుతుంటేను?—" ఒకగొంతు.

"సరే—నామాట వినండి. ఉపన్యాసం సాగనివ్వండి. మీ పంతులుగార్ని మీరే నిందించడమా? సహించరానిది నేనుదీన్ని గర్హిస్తున్నాను"

పంతులుగారు తన దీర్ఘకళేబరాన్ని కుర్చీలో చేర్చారు. అప్పయ్య సోడా అందించాడు.

"అది ప్రజలసొమ్ము. గోదావరి నిధి సొమ్ము" అని కేకలు.

"సోదరులారా తామింతవరకు ఓపికతో విన్నందుకు, కూచున్నందుకు నా ధన్యవాదాలు. పంతులుగారివంటి ఉత్తముడు, ఉదారుడు, జ్ఞాన సంపన్నుడు, పండితుడు మనకు యీ నాడు తమ అమూల్యమైన ఉపన్యాసాన్ని యిచ్చి మనలి

తరియింపజేసినందుకు నేను ఆయనకు నా తరఫున మా గోదావరి పార్టీ తరఫున, మీ తరఫున అభివందనాలర్పిస్తున్నాను. సభ ఆఖరయింది."

* * *

"పంతులూగారూ చూశారా యెంత పెద్దఅక్షరాలో. 'గోదావరి వరద బాధితుల సహాయ నిధిని గూర్చి పంతులుగారి అఖండసేవ' చూశారా యెంతమంచి హెడ్డింగో—"

"యెవరు పంపించారు?"

"యింకెవరు? నేను."

"ఆఁ అలా చెప్పండి!"

"మరి? యింకా చూడండి. రెండు వేలమంది హాజరైన బ్రహ్మాండమైన బహిరంగసభలో పంతులుగారుపన్యసించారు—"

"మీది యెంత బుర్రండీ-నిజంగా మీరు... మీరే..."

"చిత్తం బాబయ్యా-శరభయ్యగారు తలుచుకోవాల—"

"వూరుకోరా వెధవాయ్..."

"అయితే శరభయ్యగారూ-రెండువేల రెండు వందలు వసూలయింది కదా యేం చేద్దాం?"

"అదేటి బాబూ! మూడువేల రెండొందలు కదండీ?"

"ఛవ్ నోర్ముయ్-నీకు తెలిసేడిచినట్లు-యీ రెండువేల రెండొందలూ ఇంపీరియల్ బాంకులో కట్టేస్తాను. ఏమంటారు?"

"అహఁ నేనేమంటాను? యిది ప్రజలసొమ్ము. తినడానికి మనకి హక్కుందా?" బుర్ర గోకుతూ యేదో అనబోయి వూరుకున్నాడు అప్పయ్య కేసి చూస్తూ.

"అప్పయ్యా నువ్వు అవతలకెళ్లు."

"చిత్తం—"

"ఏమంటారు? చెప్పండి సందేహం దేనికి?"

"అబ్బెబ్బె, సందేహం యెందుకు? కుబేరుల దగ్గరా సందేహం? దానకర్ణులదగ్గరా సందేహం?"

"అదేదో చెపుదురూ."

"మరేంలేదు. మరి...నా...కు..."

"ఓస్. యింతేనటండీ. యీ రెండువందలూ తీసుకోండి. రెండువేల రూపాయిలు బ్యాంకులో కట్టి డ్రాపు తీసుకొస్తాను."

"మనం స్వయంగా పంచుదామనుకున్నాం కదండీ!"

"పోనిస్తురూ! ఆ గొడవంతా యెవడు పడతాడు?"

"అలా అనకండి! అది ప్రజాసేవ అనిపించుకుంటుంది."

"అలా అంటారా! సరే యీరాత్రి ఆలోచిస్తాను. రేపు ఉదయం మీరు వస్తారుకదూ?"

"అలాగే- వెళ్ళొస్తా."

"అప్పయ్యా..."

"చిత్తం బాబూ!"

"యీ విషయాలు యెవరితోనన్నా చెపావా కనక—"

"అబ్బెబ్బె! యెందుకుచెబుతానండి. తమరి దగ్గర పదేళ్ళ కాణ్ణించివున్నానుకదండి. ఆమాత్రం తెలదా అండి."

"భేష్! యిదుగో యీ రూపాయితీసుకో."

"చిత్తం. మహారాజులు."

* * *

"పెట్టెసర్దుతున్నా రెందుకు?" అడిగింది భార్య.

"కేంపు. ఆవూసు నీకెందుకు?"

"సరేలెండి. అడగడం మానేస్తాను."

"మానే. నిన్నడగమన్న దెవరు? అప్పయ్యా"

"చిత్తం బాబూ."

"మనం యీ రాత్రి బండికే వూరెళ్ళాలి."

"యే వూరు బాబూ?"

"అదంతా నీ కెందుకూ-గంగలోకి."

"చిత్తం చిత్తం..."

"నువ్వుకూడా రావాలి."

"అలాగేలెండి బాబూ. మా యాడది అడుగుతే యేటి సెప్పడవాఁ అని."

"కాశీకి అని చెప్పు."

"చిత్తం. మహారాజులు."

* * *

"పంతులుగారు లేరా అమ్మా?"

"లేరండీ-" పంతులుగారిభార్య జవాబిచ్చింది.

"ఎటు వెళ్ళారో తెలుసాండి?"

"రాత్రిబండికి కాశీ వెళ్ళారండీ - నెల్లాళ్ళకు గాని రారు."

"ఆఁ... ఎంతపని జరిగింది!" ★